క్లుప్తంగా

రాజకీయపార్టీల ప్రతినిధులతో ఎన్నికల అధికారి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి

సాలూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ సుధారాణి బుధవారం సమావేశం నిర్వహించారు. వివిధ రాజకీయపార్టీల నాయకులతో నిర్వహించిన ఈ సమావేశంలో ఓటర్ల రిజిస్ట్రేషన్, ఎన్నికల నియమావళి, పోలింగ్‌కేంద్రాల రేషనలైజేషన్ తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ నీలకంఠరావు, ఎలక్షన్ డీటీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస మాజీ సర్పంచ్ మృతి

- సంతాపం తెలిపిన రాజన్నదొర



గంగమ్మ భౌతిక కాయం వద్ద సంతాపం తెలియజేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరురూరల్: మండలంలోని కొత్తవలస మాజీ సర్పంచ్ రెయ్యి గంగమ్మ అనారోగ్యంతో బుధవారం స్వగ్రామంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. ఆమె మృతి పార్టీకి తీరనిలోటని రాజన్నదొర కొనియాడారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: ఐటీఐ కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్, కన్వీనర్ శ్రీనివాసాచారి ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 27న ఏదైనా ఓ ఐటీఐ కళాశాలకు వెళ్లి సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకుని మెరిట్ లిస్టుకు అర్హత పొందాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలకు ఈ నెల 29న, ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు ఈ నెల 30న కౌన్సెలింగ్ నిర్వహించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9052508903, 8886789002 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కొదమలో విరిగిపడిన కొండచరియలు



జారిపడిన కొండచరియలు

సాలూరు: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు గిరిశిఖర కొదమ పంచాయతీ సిరివర వద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. కొండ చరియలు విరిగి పెద్ద బండలు అటుగా వేస్తున్న రోడ్డు మీదకు జారాయి. దీంతో ప్రజలు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. కూటమిప్రభుత్వం స్పందించి ఈ బండరాళ్లను తొలగించడంతో పాటు రోడ్డును త్వరగా పూర్తిచేయాలని ఈ ప్రాంతాన్ని పరిశీలించిన సీపీఎం నాయకులు కోరారు.

ఆలస్యంగా ఉభాలు



బొడ్డవలస గ్రామంలో దమ్ము చేస్తూ నాట్లు వేస్తున్న రైతులు

సాలూరు రూరల్: మూడురోజుల పాటు కురిసిన వర్షాలకు మండలంలో వర్షాధారంపై ఆధారపడిన రైతులు కొంత ఆలస్యంగా ఉభాలు చేస్తున్నారు. ఇంతవరకు మండలంలో 40 శాతం మాత్రమే ఉభాలు జరిగాయి. ప్రస్తుతం మిగిలిన రైతులు దమ్ము చేయడం, వరి నాట్లు వేయడం ఒకేసారి చేస్తున్నారు. ఇప్పటికే ఆకులు ముదరడంతో అధిక పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. వర్షాలు ఆలస్యంగా కురవడంతో ఇప్పటికే అసంతృప్తితోనే ఉభాలు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

ఈనెల 21, 22న మాస శివరాత్రి పూజలు

పార్వతీపురం: మండలంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 21, 22 తేదీల్లో శ్రావణ మాస మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, ప్రత్యేక అభిషేక పూజలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈమేరకు స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించదలచిన భక్తులు తమ పేర్లు ముందుగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఆసక్తి గల భక్తులు ఫోన్ 9491571621 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కౌలు రైతుల ఎదురుచూపులు

- సీసీఆర్ కార్డుల జారీలో జాప్యం
- తప్పని కష్టాలు



పంట పండిస్తున్న కౌలు రైతు

బలిజిపేట: పంటలు సాగుచేస్తున్న కౌలు రైతులకు సీసీఆర్ కార్డు(క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు) ఒక వరం. ప్రభుత్వం రైతులకు ఇచ్చే అన్ని రాయితీలు పొందడానికి, ధాన్యం విక్రయించడానికి, బ్యాంకు రుణాలు పొందడానికి విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాల్లో రాయితీ పొందడానికి సీసీఆర్ కార్డులు కౌలు రైతులకు ఎంతో ఉపయోగ పడనున్నాయి. అటువంటి కార్డుల జారీలో కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తూ రైతులను కష్టాల కడలిలోకి నెడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అన్నదాత సుఖీభవ కొంతమంది రైతులకు వర్తింపచేశారు. విత్తనాల సమయం పూర్తయింది. ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. బ్యాంకు రుణాల సమయం పూర్తవుతోంది. రైతులకు అవసరమైన అన్ని రాయితీలు పొందే సమయం పూర్తవుతున్నా ఇంకా సీసీఆర్ కార్డుల జారీలో జాప్యం చేయడం దారుణంగా ఉందని రైతులు విమర్శిస్తున్నారు. అసలు కౌలు రైతు అనే వాడు ఉన్నాడని ప్రభుత్వం గుర్తిస్తోందా? లేదా? అన్నది సందేహంగా ఉందని కౌలురైతులు ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పూర్తిస్థాయిలో నష్టపోయాం. రానున్న రబీ సీజన్ సమయానికి అయినా సీసీఆర్ కార్డులు అందిస్తారా అనేది ప్రశ్నార్థకమైందంటూ ఎద్దేవా చేస్తున్నారు.

కౌలు రైతుల గుర్తింపు కోసం కసరత్తు

మండలంలో 1,300మంది కౌలు రైతులను గుర్తించేందుకు నిర్ధారణ జరిగింది. ఇప్పటికి గుర్తించిన వారు 970మంది మాత్రమే.

కూటమి ఏడాది పాలనలో..	గత ప్రభుత్వంలో..
అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నదాత సుఖీభవ పథకాన్ని ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం రైతులకు హామీ ఇచ్చింది. కానీ అధికారం చేపట్టిన సంవత్సర కాలం తరువాత అరకొరగా కొంతమంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపచేసి చేతులు దులుపుకుంది. గత సంవత్సరం అన్నదాత సుఖీభవ పథకాన్ని అటకెక్కించింది. ఉచిత పంటల బీమా గత సర్కారు ఉచితంగా చేస్తే కూటమి ప్రభుత్వం మాత్రం రైతులే ఎకరాకి కొంత మొత్తాన్ని చెల్లించి పంటల బీమా చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. ఇన్‌పుట్ సబ్సిడీ ఎప్పుడిస్తారో తెలియదు. రాయితీ విత్తనాలు, ఎరువులు, అరకొరగా సరఫరా చేస్తున్నారు. కౌలురైతుల విషయంలో ఇప్పటికీ సీసీఆర్ కార్డులు అందించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి.	రైతులకు గత వైఎస్సార్‌సీపీ సర్కారులో రైతుభరోసా, ఉచిత పంట బీమా అందించడంతో పాటు సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ, రాయితీపై ట్రాక్టర్లు, వరికోత యాంత్రాలు, వ్యవసాయ పరికరాలు మంజూరయ్యాయి. నాణ్యమైన విత్తనాలు ఇవ్వడంతో పాటు రాయితీ కల్పించారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన మేరకు ఎరువులు ఇవ్వడం, పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, ఎప్పటికప్పుడు వ్యవసాయ సంబంధ సూచనలు, సలహాలు అందించడం, పంటలకు సంబంధించిన అన్ని విషయాలలో వారికి గత ప్రభుత్వం అండగా ఉండేది.

మా పరిస్థితి అర్థం కావడం లేదు

ఖరీఫ్ సీజన్ పూర్తవుతోంది. అయినప్పటికీ కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఇప్పటికీ సీసీఆర్ కార్డులు ఇవ్వలేదు. ఇంకా దరఖాస్తు చేసుకోమంటున్నారు. ఇంతకీ ఎవరికి ఇస్తారో, ఎవరికి ఇవ్వరో తెలియదు. సాగుచేస్తున్న పంటను వదల లేకపోతున్నాం, అలాగని రాయితీలు లేకుండా అన్నీ కొనుగోలు చేసి మదుపులు పెట్టలేకపోతున్నాం. మా మొర విని మాకు త్వరగా సీసీఆర్ కార్డులు అందించాలి. – గౌరునాయుడు, కౌలురైతు, పలగర, బలిజిపేట మండలం

స్వమిత్వను పక్కాగా అమలుచేయాలి

- డీపీఓ కొండలరావు



సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు

బలిజిపేట: స్వమిత్వ పథకం పక్కాగా అమలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయితీ అధికారి కొండలరావు అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలో స్వమిత్ర గ్రామాలైన సుభద్ర, శివరాంపురం, అరసాడ గ్రామాలను ఆయన బుధవారం సందర్శించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఈ సందర్భంగా తగు సూచనలు ఇస్తూ స్వమిత్వలో ప్రతి ఇంటి కొలతలు సక్రమంగా నిర్వహించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం, నష్టం కలగకుండా చూడాలని చెప్పారు. ప్రతి ఇంటి కొలతలు పక్కాగా ఉండాలని, గ్రామ కంఠం లెక్క పక్కాగా అమలుచేయాలని సూచించారు. గతంలో జరిగిన డ్రోన్ సర్వేతో గ్రామాల్లో సిబ్బంది తీసిన కొలతలను సమన్వయం చేయనున్నామని ఆ తరువాత ఇంటి యజమానికి వివరాలు అందించనున్నట్లు తెలిపారు. ఫిజికల్‌గా ఉండే స్థలాలను గుర్తించనున్నామన్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాత ప్రజలకు వారి ఇంటి స్థలాలపై ప్రోపర్టీ కార్డులు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్ కె.చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీఓ పుష్పారావు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి



సూరంపేటలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రసాద్

సీతానగరం: మండలంలోని అన్నిగ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో, కార్యదర్శులు పారిశుధ్య పనులు చేయించాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. గ్రామాల్లో వర్షాలు కురుస్తున్నందున విధిగా పారిశుధ్య పనులు చేపట్టాలన్న సంకల్పంతో బుధవారం సూరంపేటలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాలు కురుస్తున్నందున దోమలకు నిలయాలుగా కాలువలు తయారు కాకముందే కార్యదర్శులు పరిశీలించి వీధుల్లో చెత్తను తొలగించాలని, కాలువల్లో పూడికలను తీయించాలని సూచించారు. అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య పనులు చేయిస్తూ ఫొటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు రికార్డింగ్ చేయించాలని, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ, పంచాయతీ సర్పంచ్ అమ్మన్నమ్మ, కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

డైరీ ఫామ్ యూనిట్ పరిశీలన



అమ్మవలసలో డైరీఫామ్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సుధారాణి

పాచిపెంట: మండలంలోని కర్రవలస పంచాయతీ పరిధిలో గల చాపరాయి వలస, అమ్మ వలస, గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులు నిర్వహిస్తున్న డైరీ ఫామ్, నాటు కోళ్ల పెంపకం యూనిట్ కేంద్రాలను పార్వతీపురం మన్యం జిల్లా డీఆర్డీఏ పీడీ సుధారాణి బుధవారం పరిశీలించారు. నాటు కోళ్ల పెంపకంపై ఈ సందర్భంగా ఆరా తీశారు. కోళ్ల పెంపకం ద్వారా ఏ మేరకు ఆదాయం వస్తుంది? మార్కెటింగ్ ఎలా అనే అంశాలను కోళ్ల ఫారం నిర్వాహకురాలు కూనేటి లక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. అలాగే పాడి పశువుల ద్వారా వస్తున్న ఆదాయం గురించి తెలుసుకోవడమే కాకుండా ప్రతి పాడి ఆవుకు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించుకోవాలని సభ్యులకు సూచించారు. నీటి సదుపాయం ఉన్న ప్రాంతంలో ఆక్వా ప్రాజెక్టు యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదన సిద్ధం చేయాలని వెలుగు ఏపీఎం శ్రీరాములుకు సూచించారు. అనంతరం పాచిపెంటలో వెలుగు కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యను పరిశీలించారు. ఆమెతో పాటు డీపీఎం రాజ్యలక్ష్మి, ఏపీఎం లు శ్రీరాములు, సత్యనారాయణ, పలువురు సీసీలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

లెప్రసీ పేషెంట్ పింఛన్ కట్



పెన్షన్ తొలగించడంతో ఆవేదన చెందుతున్న లెప్రసీ పేషెంట్ గోపాల్

సాలూరు రూరల్: మండలంలోని కూర్మరాజుపేట గ్రామానికి చెందిన కంది గోపాల్ లెప్రసీ పేషెంట్. ప్రతి నెలా ఆయన అందుకుంటున్న దివ్యాంగుల పెన్షన్ తొలగించినట్లు సచివాలయ సిబ్బంది చెప్పడంతో అవాక్కయ్యాడు. తాను రూ.70 పెన్షన్ ఇచ్చినప్పటి నుంచి పొందుతున్నానని ఇప్పుడు పెన్షన్ తొలగించడంపై ఆవేదన వ్యక్తం చేశాడు. తాను ఏపని చేసుకోలేనని ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్‌తోనే జీవనం సాగిస్తున్నానని విలేకరుల ఎదుట వాపోయాడు. పేదలకు మేలు చేస్తామని ఓట్లు వేయించుకుని ఇప్పుడు దివ్యాంగుల కడుపు కొడుతున్న ప్రభుత్వాన్ని ఏమనాలో అర్థం కావడంలేదని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీజనల్ వ్యాధుల దృష్ట్యా రక్త పరీక్ష నిర్వహించాలి

- బందలుప్పి వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్

పార్వతీపురం రూరల్: మండలంలోని వెంకంపేట గ్రామంలో బందలుప్పి వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం 104 వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు, అన్ని పరీక్షలు చేసి వారికి కావలసిన మందులిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షం పడడం వల్ల జ్వరాలు ప్రబలే అవకాశముండడంతో రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో రోజు వైద్య పరీక్షలు చేస్తుండాలని. వ్యాధి లక్షణాలున్న వారిని త్వరగా గుర్తించి, వైద్యసేవలు అందించాలన్నారు. మందుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. అధిక రక్తపోటు, మధుమేహం తదితర మందులు రోగులకు సక్రమంగా పూర్తిస్థాయిలో అందాలన్నారు. ప్రజలకు సేవలు అందిస్తున్న 104 వాహనంలో అన్ని మందులు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పార్వతీపురం రూరల్: మండలంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు గ్రామీణ ప్రాంత విద్యుత్ శాఖ అధికారి రామారావు బుధవారం తెలిపారు. నర్సిపురం సబ్ స్టేషన్‌కు సంబంధించిన 132/33 కేవీ పార్వతీపురం సబ్‌స్టేషన్ నుంచి నర్సిపురం వరకు ఉన్న లైన్లకు, అలాగే అడ్డాపుశీల 11కేవీ ఫీడర్‌కు సంబంధించి నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 8:30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మండలంలోని ఎమ్మార్ నగరం, బందలుప్పి, డీకే పట్నం, గంగాపురం, లచ్చిరాజుపేట గ్రామాలతో పాటు బంటువాని వలస, బాలగుడబ, నర్సిపురం బీసీ కాలనీ, వెంకట్రాయుడిపేట, ఉల్లిభద్ర, ఎస్ఆర్ పేట, పిన్నింటి రామునా యుడు వలస గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

చినుకు పడితే ప్రాణసంకటమే



బర్లి పాఠశాల వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

బలిజిపేట: చినుకుపడితే బర్లి పాఠశాల వద్ద రహదారి ప్రాణసంకటంగా మారుతోంది. కనీసం రాకపోకలకు ఏమాత్రం బాగాలేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పాఠశాల వద్ద ఈ విధంగా ఉండడం వల్ల చినుకుపడితే విద్యార్థుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని వాపోతున్నారు. కనీసం అడుగువేసేందుకు వీలులేకుండా బురదమయంగా కనిపిస్తోందని చెబుతున్నారు. విద్యార్థులు అప్రమత్తంగా లేకపోతే జారిపడే ప్రమాదముందని చెబుతున్నారు. కనీసం పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు ప్లాంక్స్ వితరణ



ప్లాంక్స్ వితరణ అనంతరం విద్యార్థులతో పొంచాది కృష్ణాజీ రావు

పాచిపెంట: మండలంలోని కొత్తవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అదే పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన విద్యా వాచస్పతి, సామాజిక కార్యకర్త పంచాది కృష్ణాజీరావు ప్లాంక్స్ వితరణ చేశారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నిర్మల చేతులమీదుగా ఈ వితరణ కార్యక్రమం చేపట్టారు. ప్లాంక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు హెచ్ఎం సూచించారు. ప్లాంక్స్ వితరణ పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ బి.నిర్మల, విశ్రాంత ఉద్యోగి ఈదుబిల్లి వెంకట నాయుడు, బలిజిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు జరజాపు జగన్నాథరావు, పి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలి పెన్షన్ తొలగింపు



పెన్షన్ తొలగించడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్న మర్రి అప్పలరాము

సాలూరు రూరల్: మండలంలోని కూర్మరాజుపేట గ్రామానికి చెందిన మర్రి అప్పలరాము అనే దివ్యాంగురాలు గడిచిన 15 ఏళ్లుగా పెన్షన్ తీసుకుంటోంది. అయితే ఆమె పెన్షన్ తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు సచివాలయ సిబ్బంది తెలియజేయడంతో అప్పటి నుంచి ఆమె ఆందోళన చెందుతోంది. తనకు ఒక కన్ను కనిపించదని అలాగే కాళ్లు పూర్తిగా విరిగిపోయినట్లు ప్రభుత్వం ఇచ్చిన సర్టిఫికెట్ ప్రకారం తనకు ఇంతవరకు పెన్షన్ వచ్చేదని ఇప్పుడు అకస్మాత్తుగా పెన్షన్ తొలగించారంటూ రోదిస్తోంది. ఏ ఆధారం లేని తన లాంటి వారిని ఆదుకోవాల్సింది పోయి ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తోంది.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం



బందలుప్పి గ్రామంలో రహదారి పక్కనే పేరుకుపోయిన చెత్త నిల్వలు



ఎమ్మార్‌నగరం ఎస్సీ కాలనీలో నీటి నిల్వలు ఏర్పడి పేరుకుపోయిన దోమలు

పార్వతీపురం రూరల్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో మరింత మెరుగైన పారిశుధ్య పనులు నిర్వహించాల్సి ఉంది. ఈ క్రమంలో పారిశుధ్య లోపంతో గ్రామాల్లో నీటి నిల్వలు, దోమలు, పేరుకుపోయిన చెత్త కుప్పలు పలు గ్రామాల్లో దర్శనమిస్తూ పారిశుధ్య లోపాన్ని ఎత్తి చూపిస్తున్నాయి. సమావేశాల్లో మెరుగైన పారిశుధ్యం అందించాలని చెబుతున్న జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. పార్వతీపురం మండలంలోని చొక్కపువాని వలస, ఎమ్మార్ నగరం, బందలుప్పి, వైకేఎం కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా జరగక అధ్వానంగా నీటి నిల్వల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలతో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. వర్షాకాల సమయంలో పారిశుధ్య లోపంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున తక్షణమే మెరుగైన పారిశుధ్య సేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లాప్ మిత్రల సమస్యలు పరిష్కరించాలి



డిప్యూటీ ఎంపీడీఓ వర్మకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయు జిల్లా నాయకుడు వెంకటరమణ

సీతానగరం: గ్రామాల్లో నిరంతరం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయు జిల్లా నాయకుడు జీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల కన్వీనర్ జె.గౌరు ఆధ్వర్యంలో పారిశుధ్య (క్లాప్ మిత్ర)కార్మికులతో బుధవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు వెంకటరమణ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలు అందడంలేదని, పనిముట్లు ఇవ్వడం లేదని, ఉద్యోగ భద్రత కల్పించడాని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన పాలకులు ఇప్పుడు విస్మరించారని విమర్శించారు. అలాగే మండల కన్వీనరు గౌరు మాట్లాడుతూ దీర్ఘకాలంగా పారిశుధ్య కార్మికులుగా సేవలందిస్తున్నామని, ఇంతవరకూ వేతనాలు చెల్లించక పోవడం వల్ల అప్పుల పాలవుతున్నామని వాపోయారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిప్యూటీ ఎంపీడీఓ కె కుమారవర్మకు వినతిపత్రం అందజేశారు.

ఉపాధి పనులు కల్పించడానికి సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ దాసు

సీతానగరం: ఇన్ఫర్మేషన్ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ (ఐఈసీ)టీమ్ పథకం ద్వారా గ్రామాల్లో ఉండే ఉపాధి కార్మికులకు మెరుగైన జీవనోపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యమని ఎస్ఆర్పీలు దాసు, గోవిందరావు అన్నారు. ఉపాధిహామీ పనులు–సామాజిక తనిఖీలు తదితరఅంశాలపై బుధవారం కొత్తవలస సర్పంచ్ రెడ్డి అనిత ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ, అవగాహన సదస్సు కార్యక్రమం జరిగింది. ఈ మేరకు ఎస్ఆర్పీలు మాట్లాడుతూ ఉపాధిహామీ శ్రామికులకు ఐఈసీ పథకం ద్వారా పనులు కల్పించి, ఉపాధిహామీ పథకంలో హక్కులు, సౌకర్యాలు, రాజీ లేని అంశాలపై పూర్తి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. వేతనం రూ.307లు వంతున అందజేస్తామంటూ ఉపాధిలో 94 రకాల పనుల గురించి వివరించారు. గ్రామంలో ఇంతవరకూ చేపట్టిన పనులకు చేసిన బిల్లులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, పంచాయతీ సామాజిక తనిఖీ సిబ్బంది, క్షేత్ర సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పట్టణంలో నిర్వహిస్తున్న ర్యాలీ

సాలూరు: ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తద్వారా సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్ అన్నారు. ఈ మేరకు ప్రపంచదోమల నివారణ దినం సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దోమలను నియంత్రించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధులు దోమకాటు వల్ల వస్తాయని తెలిపారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఈశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, శానిటరీ సెక్రటరీలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ 11వ మహాసభలు విజయవంతం చేయండి



మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సాలూరు: వచ్చే నెల 13,14 తేదీల్లో పాలకొండలో జరగనున్న సీఐటీయూ 11వ మహాసభలు విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలను అమలుచేయలేదన్నారు.

ఉపాధిరంగాలు మరింత కూరుకుపోయేలా ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. కార్మిక వర్గ సమస్యలపై చర్చించి, సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడనున్నామని అందరూ ఈ మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎన్‌వైనాయుడు, రాముడు, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.